అన్నదాత ఆశలు ఆవిరి



• ఈ చిత్రంలోని మహిళా రైతు పేరు ఉమా దేవి. ఊరు శింగనమల మండలంలోని జూలాకాల్వ. రెండు ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. ఎకరాకు రూ.45 వేల చొప్పున రూ.90 వేల వరకూ పెట్టుబడి పెట్టారు. తుపాను వర్షాలకు ఆరబెట్టిన వడ్లు మొలకెత్తాయి. దీంతో ఆమె తడిసిన ధాన్యాన్ని వేరు చేసింది. అయినా ఎక్కువ భాగం వడ్లు నానడంతో పెట్టుబడి కూడా వచ్చేలా లేదని ఆవేదన వ్యక్తం చేశారు.



• ఈ చిత్రంలోని రైతు పేరు నాగభూషణం. ఊరు శింగనమల మండలంలోని జూలాకాల్వ. నాలుగు ఎకరాల్లో వరి పంట సాగు చేశాడు. ఎకరాకు రూ.50 వేల చొప్పున రూ.2 లక్షల వరకూ పెట్టుబడి పెట్టాడు. ఇటీవల తుపాను వర్షాలకు ఆరబెట్టిన వడ్లు తడవడంతోపాటు మొలకెత్తాయి. పంట కొనేందుకు ఎవరూ రావడం లేదని వాపోయాడు. ప్రభుత్వం స్పందించి తడిసిన ధాన్యం కొనుగోలు చేసి ఆదుకోవాలని కోరాడు.



కొరివిపల్లి వద్ద ఆరబెట్టిన వరిధాన్యం

• వర్షాలకు తడిసి మొలకెత్తిన వరి ధాన్యం
• కొనడానికి రాని వ్యాపారులు
• ఆందోళనలో రైతులు

శింగనమల: ఆరుగాలం శ్రమించి, పండించిన పంటను విక్రయించే దశలో వర్షం రావడంతో ధాన్యం తడవడంతోపాటు, మొలకెత్తడంతో కొనడానికి వ్యాపారులు ముందుకు రాక రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం ధాన్యంను కొనుగోలు చేసి ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు. శింగనమల నియోజకవర్గంలోని గార్లదిన్నె, శింగనమల, పుట్లూరు, నార్పల, బుక్కరాయసముద్రం, యల్లనూరు మండలంలో రైతులు సుమారు 800 ఎకరాల్లో వరి పంట సాదు చేశారు. శింగనమల మండలంలోని కొరివిపల్లి, జూలకాల్వ, పి.జలాలపురం, చీలేపల్లి , సలకంచెరువు గ్రామాలకు చెందిన రైతులు దాదాపు 200 ఎకరాల్లో వరి పంటను సాగుచేశారు. ఎకరాకు రూ.30 వేలు నుంచి రూ.40 వేలు వరకు పంట పెట్టుబడి పెట్టారు. సాగు చేసిన వరి పంటను పది రోజుల క్రితం కోత కోశారు. కోత కోసిన తరువాత నుంచి అకాల వర్షం పడుతుండడంతో పంట తడిసి పోయింది. కొంత మంది రైతులు కోత కోసి, వరిధాన్యం ఆరబెట్టుకుంటున్న దశలో వర్షం రావడంతో తడిసిపోయింది.

రంగు మారి.. మొలకలు వచ్చి..

ఫెంగల్ తుఫాను ప్రభావంతో కళ్లాలకు చేరిన ధాన్యం తడిసిపోయి రంగు మారడంతో పాటు మొలకలు వస్తున్నాయని రైతులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తామని, 48 గంటల్లో ధాన్యం సేకరించిన డబ్బు రైతుల ఖాతాల్లో జమ చేస్తామని చెప్తున్నా.. జిల్లాలో ఎక్కడా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. తడిసిన ధాన్యం కళ్లాల్లో కుప్పలు పోసిన ధాన్యంలో మొలకలు వస్తున్నాయని అన్నదాతలు గగ్గోలు పెడుతున్నారు. గత మూడు రోజుల నుంచి వర్షం వస్తుండడంతో , వరి ధాన్యం టార్పాలిన్ పట్టలు వేసి కప్పి పెట్టారు. శుక్రవారం వర్షం రాకపోవడంతో టార్పాలిన్ పట్టలు తొలగించి, వరిధాన్యం ఆరబెట్టారు. తడిసిన ధాన్యం మొలకలు వచ్చాయి. మొలకలు వచ్చిన వరిధాన్యం చూసి రైతులు ఆవేదన చెందుతున్నారు. పంట విక్రయించే దశలో వరిధాన్యం మొలకలు రావడంతో కన్నీరుమున్నీరవుతున్నారు. మొలకలు వచ్చిన ధాన్యం కొనడానికి వ్యాపారులు ముందుకు రావడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించిన వరి ధాన్యం కొనుగోలు చేయాలని వారు కోరారు.

వ్యాపారులు కొనుగోలు చేయడానికి రావడం లేదు



వరిధాన్యం తడిసిందని వ్యాపారాలు ఎవరూ కొనేందుకు రావడం లేదు. మా ఊరు నుంచి కిలో మీటరు వరకూ రహదారిపై ధాన్యం ఆరబెట్టుకుంటున్నాం. రెండు ఎకరాలు పొలంలో 40 బస్తాల దిగుబడి వచ్చింది. పెట్టుబడి రూ.లక్ష వరకు వచ్చింది. ధాన్యం తడవడంతో నష్టపోయాం.

–శివశంకర్‌రెడ్డి రైతు, కొరివిపల్లి

వ్యవసాయం బరువు



రెండు ఎకరాల్లో వరి సాగు చేశాను. ఎకరాకు రూ.40 వేల చొప్పున రూ.80 వేలు పెట్టుబడి పెట్టాను. కాని వర్షం రావడంతో, కప్పెట్టిన ధాన్యం తడిసిపోయింది. మొలకలు పోవడంతో వ్యాపారులు కొనేందుకు రావడం లేదు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలి. వ్యవసాయం చేయాలంటే బరువుగా ఉంది.

– రమేష్, రైతు, కొరివిపల్లి

క్లుప్తంగా

గోశాల నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ అనంతరం పనులు ప్రారంభిస్తున్న దాతలు

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం సమీపంలో నూతన గోశాల నిర్మాణానికి శుక్రవారం వేకువజామున దాత పరమేశ్వర సింగ్ కుటుం సభ్యుల ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు. ప్రస్తుతం ఆలయంలో నిర్వహిస్తున్న గోశాల చిన్నది కావడంతో గోవుల పరిరక్షణ ఇబ్బందిగా మారింది. దీంతో ఆలయ సమీపంలో నూతన గోశాల నిర్మాణానికి వారం క్రితం రంగారెడ్డి జిల్లా, వట్టినాగులపల్లి గ్రామానికి చెందిన దాత పరమేశ్వర సింగ్‌ను ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు, అర్చకుడు చక్రవర్తి స్వామి కలిశారు. స్పందించిన దాత పరమేశ్వర సింగ్ రూ.50 లక్షల వ్యయంతో రేకుల షెడ్డు నిర్మించేందుకు అంగీకరించారు. దీంతో శుక్రవారం వేకువజామున ఆలయ అనువంశిక ధర్మకర్త సుగుణమ్మ, ఇతర సిబ్బంది ఆధ్వర్యంలో దాత పరమేశ్వరసింగ్, ఆయన భార్య రేఖాబాయ్ భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు.

‘కోన’లో సజావుగా వేలం

తాడిపత్రి రూరల్: మండలంలోని ఆలూరు కోన రంగనాథస్వామి దేవాలయంలో వివిధ అంశాలకు సంబంధించి శుక్రవారం వేలం నిర్వహించారు. టెంకాయలు, పూజ సామగ్రి, స్వామి అమ్మవార్ల ఫొటోలు, కూల్‌డ్రింక్స్ విక్రయానికి రూ. 3.82 లక్షలు, హోటల్ నిర్వహణకు లక్ష్మీదేవి రూ.31వేలు, పార్కింగ్ కోసం రాజా రూ.1.12 లక్షలు, తలనీలాల సేకరణకు రంగప్రసాద్ రూ.7.35 లక్షలు, కల్యాణ మండపాలు, వసతి గదులు, గెస్ట్‌హౌస్ కోసం చెన్నకేశవులు రూ.2.60 లక్షలకు వేలం పాడి దక్కించుకున్నారు. కార్యక్రమంలో పర్యవేక్షణాధికారి సుబ్రమణ్యం, ఈఓ రామాంజనేయులు, అప్‌గ్రేడ్ సీఏ శివగంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ నేరం



మాట్లాడుతున్న ప్రోగ్రాం ఆఫీసర్ యుగంధర్

గుంతకల్లు: లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని వక్తలు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో పట్టణంలోని ఆర్‌ఎంపీ, పీఎంపీలకు గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టం 1994పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రోగ్రాం ఆఫీసర్ యుగంధర్, పీపీ యూనిట్ వైద్యులు కళ్యాణ్ చక్రవర్తి, జయవర్ధన్‌రెడ్డి, సుజాత మాట్లాడుతూ గర్భిణులకు అబార్షన్ మందులు రాయడం చట్ట విరుద్ధమన్నారు. తల్లీబిడ్డ క్షేమం దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వాస్పత్రులకు రెఫర్ చేయాలన్నారు. లింగ నిర్ధారణను ప్రోత్సహించినా, అబార్షన్ వంటి చర్యలకు పాల్పడినా శిక్ష తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రభుత్వాస్పత్రి పర్యవేక్షకుడు అజేంద్ర, డాక్టర్లు అరుణ, హరిత, ఆరోగ్య బోధకుడు సత్యనారాయణ, వేణుగోపాల్ పాల్గొన్నారు.

‘కోటంక’లో నేడు కల్యాణోత్సవం

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ప్రధాన అర్చకుడు రామాచార్యులు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తెల్లవారుజామున 4 గంటలకు స్వామికి రుద్రాభిషేకం, 9.30 గంటలకు శ్రీవల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తామన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మికసంఘం నాయకులు

తాడిపత్రిటౌన్: ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని వ్యవసాయకార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రంగయ్య ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పేదలకు మూడు సెంట్ల స్థలం ఇచ్చి పక్కాగృహాలు నిర్మించి ఇస్తామన్న కూటమి ఎన్నికల హామీని వెంటనే అమలు చేసి మాట నిలబెట్టుకోవాలన్నారు. అలాగే కూలీలు వలసలు పోకుండా ఉపాధి పనులు చేపట్టాలన్నారు. రెవెన్యూ సదస్సుల్లో బంజరు భూములు గుర్తించి పేదలకు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో తాడిపత్రి నియోజకవర్గ కార్యదర్శి వీటీ రామాంజనేయులు, జిల్లా నాయకుడు సూర్యనారాయణ, నారాయణరెడ్డి, నాగరంగయ్య, గోపాలకృష్ణ, ఓబులేసు, గోపాలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పాలిటెక్ ఫెస్ట్‌కు ఎంపిక



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న గేట్స్ కళాశాల యాజమాన్యం

గుత్తి: గుత్తి గేట్స్ పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థులు రాష్ట్రస్థాయి టెక్ ఫెస్ట్‌కు ఎంపికయ్యారు. వివరాలు.. అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిటెక్ ఫెస్ట్ 2కే24 అనే పేరుతో జిల్లా స్థాయిలో సాంకేతిక పోటీలు నిర్వహించారు. జిల్లాలోని అన్ని పాలిటెక్నిక్ కాలేజీల విద్యార్థులు పాల్గొని తమ ఐడియాలను ప్రదర్శించారు. ఇందులో గేట్స్ పాలిటెక్నిక్ కళాశాలలో ఫస్టియర్ ఈసీఈ చదువుతున్న సైఫ్ అలీ, మహమ్మద్ అక్రమ్ వైర్‌లెస్ ఎలక్ట్రిక్ వెహికల్ చార్జింగ్ సిస్టమ్ అనే అంశాన్ని ప్రదర్శించారు. దీంతో వారిని ఈ నెల 18న నిర్వహించే రాష్ట్రస్థాయి పాలిటెక్ ఫెస్ట్ 2కే24కు ఎంపిక చేశారు. గేట్స్ పాలిటెక్నిక్ కాలేజీలో శుక్రవారం సాయంత్రం రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో గేట్స్ కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, ప్రిన్సిపాల్ డాక్టర్ నరసింహులు, డైరెక్టర్ వాణి, ఎండీ రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు.

ఆర్డీటీ క్రీడా పోటీల్లో బీకేఎస్ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఆర్డీటీ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వసుంధర, పీడీ గోపాల్‌రెడ్డి తెలిపారు. ఆర్డీటీ సౌజన్యంతో సెంట్రల్ జోన్ లెవల్ సాఫ్ట్‌బాల్ రూరల్ లీగ్ చాంపియన్ షిప్-2024 పోటీలు అనంతపురం నగరంలోని ఆర్డీటీ క్రీడా మైదానంలో ఈ నెల 5, 6న నిర్వహించారు. పోటీల్లో నాలుగు జోన్ల నుంచి ఎనిమిది జట్లు పోటీ పడ్డాయి. ఈ పోటీలలో అన్ని మ్యాచ్‌లలో బీకేఎస్ జట్టు ఆడి ఫైనల్‌లో కనగానపల్లి సాఫ్ట్‌బాల్ క్లబ్ జట్టును 2/0 గోల్స్ తేడాతో విజయం సాధించి విజేతగా నిలిచిందన్నారు. ఆర్డీటీ గ్రాస్ రూట్ లెవల్ కోఆర్డినేటర్ వంశీక్రిష్ణ చేతుల మీదుగా మెడల్స్ అందుకున్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఏపీ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ నాగేంద్ర, సింహాద్రి, రాజు అభినందించారు.

బయోమెట్రిక్ వందశాతం వేయాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీపీఓ నాగరాజునాయుడు

శింగనమల: సచివాలయాల సిబ్బంది బయోమెట్రిక్ వంద శాతం వేయాలని డీపీఓ నాగరాజునాయుడు ఆదేశించారు. శుక్రవారం శింగనమల సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, సిబ్బంది హాజరును పరిశీలించారు. పంచాయతీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, పంచాయతీ పన్నుల వసూలు గురించి పంచాయతీ కార్యదర్శితో అడిగి తెలుసుకున్నారు.

రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌కు ఘన నివాళి

సాక్షి నెట్‌వర్క్: తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లో శుక్రవారం రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఎమ్మార్పీఎస్ నాయకులు, కుల సంఘాల నేతలు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు ప్రాంతాల్లో ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. వక్తలు మాట్లాడుతూ అంబేడ్కర్ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని సూచించారు.



బీకేఎస్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వీరాంజనేయులు



గుంతకల్లులో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



తాడిపత్రిలో అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



గుత్తిలో అంబేడ్కర్ వర్ధంతి నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



బీకేఎస్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణి



పెద్దపప్పూరులో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నేతలు

భూసమస్యల పరిష్కారమే లక్ష్యం



కసాపురంలో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాస్

సాక్షి నెట్‌వర్క్: భూ సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించడమే రెవిన్యూ సదస్సుల లక్ష్యమని ఆర్డీఓ శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం గుంతకల్లు మండలంలోని కసాపురం, సంగాల గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ రైతులు ఎటువంటి భూ సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు చేపడతామన్నారు. కోర్టుల్లో ఉన్న భూ సమస్యలను అక్కడే పరిష్కరించుకోవాలన్నారు. రస్తా వివాదాలు, ఆన్‌లైన్ సమస్యలు, తదితర ఎటువంటి సమస్యలు ఉన్నా వాటిని ఆర్జీల రూపంలో అందజేయాలని రైతులకు సూచించారు. కాగా కసాపురంలో 33 అర్జీలు, సంగాల గ్రామంలో 12 అర్జీలు అందినట్లు తహసీల్దార్ రమాదేవి, ఆర్‌ఐ హరిప్రసాద్ తెలిపారు.

• గుత్తి మండలంలోని ఎంగిలిబండ గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సును ప్రారంభించారు. ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షితో కలసి ఆర్డీఓ శ్రీనివాసులు, ప్రత్యేక అధికారి కల్యాణి రైతులతో వినతులను స్వీకరించారు. సర్పంచ్ గురుమస్తాన్, ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్, ఏఓ ముస్తాక్ అహ్మద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

• పామిడి మండలంలోని జీ కొట్టాల, దేవరపల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. జీ కొట్టాలలో 33, దేవరపల్లిలో 17 చొప్పున ప్రజలు 50 అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీధర మూర్తి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

• శింగనమల మండలంలోని లోలూరు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. : తహసీల్దార్ బ్రహ్మయ్య, ప్రత్యేకాధికారి రఫిక్, ఎంపీడీఓ నిర్మలాకుమారి, ఈఓఆర్డీ వెంకటలక్ష్మి, ఎంపీటీసీ మొరార్జీ, డిప్యూటీ సర్వేయర్ పునీత్‌కుమార్, మండల సర్వేయర్ స్టీఫెన్ వరకుమార్ తదితరులు పాల్గొన్నారు.

• యాడికి: మండలంలోని గుడిపాడు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గ్రామ సభలో ప్రజల నుంచి 25 అర్జీలు వచ్చినట్లు మండల ప్రత్యేక అధికారి రామాంజనేయులు, తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి తెలిపారు.

• పెద్దపప్పూరు మండలంలోని జోడిధర్మాపురంలో రెవెన్యూ సదస్సు నిర్వహించగా తహసీల్దార్ బాలాజీరాజుకు రైతులు వినతిపత్రాలు అందజేశారు. వీఆర్‌ఓ కిషోర్, ఏఓ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

• పెద్దవడుగూరు మండలంలోని ఆవులాంపల్లి, విరుపాపురం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించగా 14 అర్జీలు వచ్చినట్లు ప్రత్యేక అధికారి వెంకటరమణనాయక్, తహసీల్దార్ ఉషారాణి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహారెడ్డి, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

• గార్లదిన్నె మండల పరిధిలోని కొప్పల కొండలో అధికారులు రెవెన్యూ సదస్సు నిర్వహించగా 16 మంది రైతులు వినతిపత్రాలు అందజేశారు. మండల స్పెషల్ ఆఫీసర్, జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ శ్రీనివాసులనాయక్, తహసీల్దార్ ఈరమ్మ, రెవెన్యూ అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పెద్దవడుగూరు మండలం ఆవులాంపల్లిలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న అధికారులు



గార్లదిన్నె మండలం కొప్పలకొండలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఈరమ్మ

కూల్చివేత పేర కలెక్షన్ల పర్వం!

పామిడి: పామిడిలో రెండునెలలుగా స్థానిక బీసీసీరోడ్డుకు ఇరువైపులా గల అక్రమ కట్టడాల కూల్చివేత చేపట్టారు. పామిడి పంచాయతీ ఈఓ గోపాల్ ఆధ్వర్యంలో పంచాయతీ స్థలంలోని అక్రమ కట్టడాలను కూల్చివేశారు. ఇందులో భాగంగా బీసీసీ రోడ్డు నిడివిని నోచుకోవడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఇది కొందరు ప్లాట్ల యజమానులకు ఇది కలిసి వచ్చినట్లెంది. గత 15 ఏళ్లుగా స్థానిక ఫారెస్ట్ బంగ్లా సమీపాన సర్వేనెంబర్ 466 లో ఐదుగురు పార్టనర్స్‌గా ఏర్పడి లేఔట్ వేశారు. అది ఫారెస్ట్ బంగ్లా భూమి కావడంతో అప్పట్లో ఆ స్థలంలో ఎంజాయ్‌మెంట్‌లో ఉండేవారు. దీంతో లేఔట్ కొనుగోలుదారులు ఎంజాయ్‌మెంట్‌లో ఉన్నవారిపై కోర్టుకు వెళ్లారు. ఈ స్థల వివాదం కోర్టులో దావా నడుస్తుండడంతో అప్పట్లో లేఔట్‌లో ప్లాట్లు కొనుగోలుకు నోచుకోలేదు. దీనికితోడు లేఔట్‌కు ముందు భాగంలో ఎంజాయ్‌మెంట్ దారులు షాపులు, నివాసాలు ఏర్పాటు చేసుకోవడంతో లేఔట్ పూర్తి మరుగు అవ్వడం కూడా ప్లాట్లు అమ్ముడుపోలేదు. దీనికితోడు కోర్టు ప్లాట్ నిర్వాహకులకు అనుకూలంగా తీర్పు ఇచ్చినట్లు సమాచారం. అయినప్పటికీ వారు ఎన్నోఏళ్ళుగా లేఔట్ ముందు షాపులు, నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారిని కదిలించలేక పోయారు. ఇదే సమయంలో రోడ్డుకు ఇరువైపులా కూలిచ్వేత చేపట్టడాన్ని లేఔట్ నిర్వాహకులు సద్వినియోగం చేసుకున్నారు. లేఔట్ నిర్వాహకులు స్థానిక అధికారపార్టీ నేత చొరవతో స్థానిక నియోకవర్గ ప్రజాప్రతినిధికి లక్షల రూపాయలు ముట్టచెప్పి సమస్యను పరిష్కరించుకున్నట్లు సమాచారం. ఆ ప్లాట్ నిర్వాహకుల బృందం స్థానిక పచ్చనేత సహకారంతో నేరుగా హైదరాబాద్‌లో ఆ ప్రజాప్రతినిధిని కలిసి తమ లేఔట్ ముందు అక్రమంగా ఎంజాయ్‌మెంట్‌లో ఉన్న షాపులను, నివాసాలను కూల్చివేయడానికి రూ.20 లక్షలు గుడ్‌విల్‌గా అందజేసినట్లు బహిరంగ ఆరోపణలు ఉన్నాయి. ఈఓ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కూల్చివేతను అదునుగా తీసుకొని నియోజకవర్గ ప్రజాప్రతినిధి ప్రోద్బలంతోనే అవి కూల్చివేతకు నోచుకున్నాయన్న? విషయం పామిడిలో హాట్ టాపిక్‌గా మారింది.

యువతి ఆత్మహత్యాయత్నం

పెద్దపప్పూరు: మండలంలోని కొట్టాలపల్లిలో శుక్రవారం శరణ్య అనే యువతి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నాకి పాల్పడింది. పొలం పనులకు వెళ్లిన తల్లిదండ్రులు ఓబులేసు, పెద్దులక్క ఆపస్మారకస్థితిలో ఉన్న యువతిని తాడిపత్రి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు అనంతపురం తరలించారు.

జగన్‌ను కలిసిన నైరుతిరెడ్డి



వైఎస్ జగన్‌తో నైరుతిరెడ్డి తదితరులు

గుంతకల్లు: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గుంతకల్లు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి శుక్రవారం తాడేపల్లిగూడెం క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారని నైరుతిరెడ్డి తెలిపారు. అలాగే గుంతకల్లు నియోజకవర్గ పరిస్థితులు, పార్టీ మరింత బలోపేతంపై తీసుకోవాల్సిన చర్యలు తదితర విషయాలపై మాట్లాడినట్లు ఆమె వివరించారు. ఆమెతోపాటు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చెన్నకేశవ రెడ్డి, సీనియర్ నాయకుడు జానికిరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీమా ప్రీమియం చెల్లించండి

గుత్తి రూరల్/శింగనమల: రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన పప్పుశనగ, జొన్న తదితర పంటలకు తప్పకుండా బీమా ప్రీమియం చెల్లించాలని గుత్తి డివిజన్ ఏడీఏ వెంకట్రాముడు రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని తురకపల్లి రైతు సేవా కేంద్రంలో బీమాపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ పప్పుశనగ పంటకు రూ.450, జొన్న పంటకు రూ.315, మొక్క జొన్నకు రూ.525, వేరుశనగకు రూ.480 ప్రకారం ప్రీమియం చెల్లించాలన్నారు. ప్రీమియం చెల్లించని రైతులకు పంట నష్టపరిహారం అందదన్నారు. కార్యక్రమంలో వీఏఏలు మానస, జగదీష్, మహేష్ పాల్గొన్నారు. అలాగే రబీ కింద సాగు చేసిన పప్పుశనగ తదితర పంటకు బీమా ప్రీమియం చెల్లించాలని శింగనమల ఏఓ అన్వేష్‌కుమార్ సూచించారు. రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలన్నారు.

ఉపాధ్యాయులకు రక్షణ కరువు



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి బాషా

గుత్తి: కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులపై దాడులు అధికమైయ్యాయి. ఉపాధ్యాయులకు రక్షణ లేకుండా పోతోందని గుత్తి మండల ఏపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి బాషా ఆవేదన వ్యక్తం చేశారు. గుత్తిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏపీటీఎఫ్ నాయకులు అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాషా మాట్లాడారు. ఇటీవల ఉపాధ్యాయులపై రాజకీయ నాయకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రుల దాడులు అధికమైయ్యాయన్నారు. రాయచోటిలోని ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయుడు ఇజాజ్ అహ్మద్‌ను విద్యార్థులు కొట్టి చంపడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఉపాధ్యాయ లోకం ఏకమై ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పలువురు ఏపీటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడి మృతి



తిమ్మారెడ్డి (ఫైల్)

గుంతకల్లు: కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎం.తిమ్మారెడ్డి (65) గుండెపోటుతో మృతి చెందినట్లు పార్టీ నాయకులు తెలిపారు. శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా మున్సిపల్ కార్యాలయ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళుర్పించిన అనంతరం తిమ్మారెడ్డికి గుండెనొప్పి రావడంతో వెంటనే పార్టీ నాయకులు సమీపంలోని విజేత హాస్పటల్ తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షలు చేయగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. వెంటనే ఆయన మృతదేహాన్ని పాతగుంతకల్లులోని స్వగృహానికి తరలించారు. వివిధ పార్టీల నాయకులు మృతదేహానికి నివాళులర్పించారు.